

## సునీతమ్మకే నర్సాపూర్ బీఆర్‌ఎస్ బీ ఫామ్

- ఎమ్మెల్యే మదన్‌రెడ్డికి మెదక్ ఎంపీ అభ్యర్థిగా అవకాశం
- ఆయన సేవలను పార్టీ గొప్పగా వినియోగించుకుంటుంది
- సునీతా లక్ష్మారెడ్డికి బీఫామ్ అందజేసిన సీఎం కేసీఆర్

హైదరాబాద్, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్ పార్టీ నర్సాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థిగా సునీతా లక్ష్మిరెడ్డిని పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ ప్రకటించారు. ఈ మేరకు బుధవారం ఎమ్మెల్యే మదన్‌రెడ్డితో కలిసి ఆమెకు బీఫామ్ అందజేశారు. మదన్ రెడ్డికి రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మెదక్ ఎంపీ అభ్యర్థిగా అవకాశం ఇవ్వాలని పార్టీ నిర్ణయించింది. పార్టీలో అంతర్గత సర్దుబాటు చేస్తూ, అధినేత సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో భేటీ అయిన పార్టీ కోర్ కమిటీ సభ్యులు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ఏకగ్రీవంగా బీఆర్‌ఎస్ పార్టీ కీలక సభ్యులు తీసుకున్న నిర్ణయంపై సీఎం కేసీఆర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ మాట్లాడుతూ మదన్‌రెడ్డి తనతో పార్టీలో మొదటినుంచి కొనసాగుతున్న సీనియర్ నాయకుడని పేర్కొన్నారు. 35 ఏండ్ల నుంచి తనతో సన్నిహితంగా ఉంటున్నారని, ఆయన తనకు అత్యంత ఆప్తుడని, కుడి భుజం లాంటివాడని తెలిపారు. సోదర సమానుడైన మదన్‌రెడ్డి.. పార్టీ ఆలోచనలను గౌరవించి నర్సాపూర్ ఎన్నికను తన భుజస్కంధాలమీద వేసుకుని సునీతా లక్ష్మారెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించే బాధ్యత తీసుకున్నందుకు సంతోషంగా ఉన్నదని తెలిపారు. మదన్‌రెడ్డి కేవలం నర్సాపూర్‌లోనే కాకుండా జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో పాపులర్ లీడర్ అని, వివాదరహితుడిగా, సౌమ్యుడిగా పేరున్న ఆయన సేవలను పార్టీ మరింత గొప్పగా వినియోగించుకుంటుందని చెప్పారు. చిన్నచిన్న సర్దుబాట్లు చేసుకుంటూ కీలక సమయంలో ఐక్యంగా ముందుకు పోవడం ద్వారా ఆయన పార్టీ ప్రతిష్ఠను మరింత ఇనుమడింపజేశారంటూ కేసీఆర్ అభినందించారు.

# తెలంగాణకు కాంగ్రెస్ దోఖా

మొదటిపేజీ తరువాయి...

నినదించారు. బుధవారం తెలంగాణ భవన్‌లో మహబూబ్‌నగర్ మున్సిపల్ మాజీ చైర్మన్, ఆ జిల్లాకు పదేండ్లు డీసీసీ ప్రెసిడెంట్‌గా పనిచేసిన ముత్యాల ప్రకాశ్, పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ నేతలు సత్యనారాయణరెడ్డి, రామ్మూర్తి తదితరులు మంత్రులు కేటీఆర్, శ్రీనివాస్‌గౌడ్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. కేటీఆర్ వారికి గులాబీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజలు బీఆర్‌ఎస్‌ను మాత్రమే తమ ఇంటిపార్టీగా సగర్వంగా చెప్పుకుంటారని పేర్కొన్నారు.

### ఒక ఎమ్మెల్యే గేట్లు ఎత్తుడు.. మరొకరు దించుడు

చొప్పదండి–పెద్దపల్లి, జగిత్యాల–పెద్దపల్లి మధ్య అప్పట్లో సాగునీటి పంచాయితీ ఉండేదని కేటీఆర్ గుర్తు చేశారు. ఎస్సారెస్పీ కాలువ నీటిపై ఎమ్మెల్యేలు సైతం గొడవపడిన సందర్భాలున్నాయని చెప్పారు. ఒక ఎమ్మెల్యే గేట్లు ఎత్తుడు..మరో ఎమ్మెల్యే గేట్లు దించుడు, కరెంట్‌వాళ్లు మోటార్లు గుంజుకపోవుడు.. కాలువల్లో వేసుడు ఉండేదని, దశాబ్దాలుగా ఈ లొల్లి సాగిందని గుర్తు చేశారు. ఇప్పుడా పంచాయితీలున్నాయా? అని ప్రశ్నించారు.

### బాధపడుతున్న కర్ణాటక ప్రజలు

కాంగ్రెస్‌ను గెలిపించి తప్పు చేశామని నాలుగు నెలలకే కర్ణాటక ప్రజలు చెంపలు వేసుకుంటున్నారని చెప్పారు. రోజుకు 5 గంటలు కరెంట్ ఇచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కిందామీదా పడుతున్నదని ఎద్దేవా చేశారు. కరెంట్ లేక అక్కడి రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, కాలువల్లో, చెరువుల్లో నీళ్లలేక మొసళ్లు బయటకు వస్తున్న దుస్థితి ఏర్పడిందన్నారు. ఖర్గే సొంత రాష్ట్రంలో రైతులు మొసళ్లతో నిరసన తెలుపుతున్నారని పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో మూడు గంటల కరెంట్ చాలని పేర్కొన్న విషయాన్ని కేటీఆర్ గుర్తుచేశారు. 24 గంటల కరెంట్ కావాలో? 3 గంటల కరెంట్ కావాలో రైతులు ఆలోచించాలని సూచించారు.

### బార్ బార్ కాంగ్రెస్ దోఖా

తెలంగాణను గద్దలపాలు కానివ్వకూడదనే లక్ష్యంతో అసలు సిసలు నిఖార్సైన తెలంగాణవాదులు సీఎం కేసీఆర్‌కు అండగా నిలబడాలని బీఆర్‌ఎస్‌లోకి వస్తున్నారని, అందులో భాగంగానే పెద్దపల్లి నుంచి సత్యనారాయణరెడ్డి, రామ్మూర్తి, ముత్యాల ప్రకాశ్‌లాంటి వాళ్లు బీఆర్‌ఎస్‌లోకి వస్తున్నారని చెప్పారు. అభివృద్ధి, సంక్షేమాన్ని అద్భుతంగా చేసుకుంటున్న తరుణంలో తెలంగాణను మళ్లీ దొంగల చేతుల్లో, దగుల్బాజీ కాంగ్రెస్ చేతిలో పెడితే రాష్ట్రం నాశనం అయితదని ఆవేదన వ్యక్తం చేశారు.



తెలంగాణభవన్‌లో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ సమక్షంలో బుధవారం బీఆర్‌ఎస్‌లో చేరిన పెద్దపల్లి కాంగ్రెస్ నేత సత్యనారాయణరెడ్డి. చిత్రంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్, పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్‌యాదవ్, మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి

### వారు వీరు.. వీరు వారు

**తెలంగాణ** భవన్‌లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. పెద్దపెల్లి కాంగ్రెస్ నేత సత్యనారాయణరెడ్డి తెలంగాణభవన్ వేదికగా మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ప్రస్తుత పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డిని సీఎం కేసీఆర్ సమక్షంలో అప్పట్లో సత్యనారాయణరెడ్డి బీఆర్‌ఎస్‌లో చేర్పించారు. ఇప్పుడు ఆయనే ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరడం విశేషం.

### తెలంగాణకు కేసీఆర్ భరోసా

గురువారం నుంచి 'కేసీఆర్ భరోసా' పేరుతో మ్యానిఫెస్టోను ఇంటింటికీ తీసుకెళ్లి వివరించబోతున్నట్టు చెప్పారు. ప్రస్తుతం ఆసరా కింద అందిస్తున్న రూ. 2,016ను రూ. 5,016కు పెంచబోతున్నామని, దివ్యాంగులకు రూ. 6016 ఇవ్వబోతున్న విషయాన్ని ప్రజలకు వివరించబోతున్నామని చెప్పారు. కేసీఆర్ మూడోసారి అధికారంలోకి వచ్చిన తరువాత రైతుబంధును రూ. 10వేల నుంచి రూ. 16వేలకు పెంచబోతున్నట్టు తెలిపారు. రేషన్‌కార్డున్న ప్రతీ కుటుంబానికి అన్నపూర్ణ పథకం ద్వారా సన్నబియ్యాన్ని పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. సౌభాగ్యలక్ష్మి కార్యక్రమం ద్వారా అర్హులైన ప్రతీ మహిళకు నెలకు రూ. 3వేల చొప్పున ఇవ్వబోతున్నామని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ సహా అన్ని వర్గాల ప్రజలకు గతంలో పంపిణీ చేసిన అసైన్డ్ భూముల మీద హక్కులు లబ్దిదారులకే కల్పించబోతున్నామన్నారు. ఆడబిడ్డలకు కేసీఆర్ భరోసా కింద గ్యాస్ సిలిండర్‌ను రూ. 400కే ఇవ్వబోతున్నామని వివరించారు. కేసీఆర్ మూడోసారి అధికారంలోకి రాగానే 15 రకాల సౌకర్యాలను 'కేసీఆర్ భరోసా' ద్వారా ఇవ్వబోతున్నారని, ఇదే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి బీఆర్‌ఎస్ కార్యకర్తపైనా ఉందని సూచించారు.

### ఎట్లున్న తెలంగాణ ఎట్లయింది?

'తెలంగాణ ఏర్పడకముందు ఎట్లున్న తెలంగాణ.. తొమ్మిదిన్నరేండ్ల తరువాత కేసీఆర్ పాలనలో ఎట్ల అయిందనే విషయాన్ని ప్రతి ఒక్కరూ ఆలోచించాలి' అని కేటీఆర్ కోరారు. విద్య, వైద్యం రంగాల్లో అద్భుత పురోగతి సాధించామని, 10,021 గురుకులాలు, బస్తీ దవాఖానలు మొదలుకొని జిల్లాకో మెడికల్ కాలేజీ దాకా అన్ని రంగాల్లో తెలంగాణ మహోజ్వలంగా ముందుకు సాగుతున్నదని వివరించారు. గతంలో ఏ ప్రభుత్వమూ యాదవులను పట్టించుకోలేదని పేర్కొన్నారు. ఈ విషయాన్ని గమనించే కేసీఆర్ గొర్రెల పంపిణీ చేపట్టారని తెలిపారు. కేసీఆర్ నాయకత్వంలో అన్ని రంగాలు అద్భుతంగా బాగయ్యాయని, ప్రజలు అండగా నిలిచి మూడోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, ఎంపీ బీబీ పాటిల్, పౌర సరఫరాల కార్పొరేషన్ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్‌యాదవ్, మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి, జడ్పీటీసీ లక్ష్మణ్, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు హాజీ, పార్టీ నేతలు గుర్రాల మల్లేశ్, న్యాయవాది అవని, నాయకురాలు చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.


> తెలంగాణ యువతకు కేసీఆర్ భరోసా కింద వినూత్న కార్యక్రమాన్ని చేపట్టబోతున్నాం. రాష్ట్రంలో ఇప్పటికే 2.2 లక్షల ఉద్యోగాల భర్తీ ప్రక్రియ విజయవంతంగా కొనసాగుతున్నది. ఇప్పటికే 1.32 లక్షల ఉద్యోగాలు భర్తీ చేశాం. మరో 80–90వేల ఉద్యోగాల భర్తీ ప్రక్రియ కొనసాగుతున్నది. కేసీఆర్ భరోసా కింద ప్రతీసంవత్సరం జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేసి ఆ ఏడాది రిటైర్ అయ్యే సంఖ్యను నిర్దిష్ట కాల వ్యవధితో భర్తీచేసాం.
>
> -మంత్రి కేటీఆర్

> టీఆర్‌ఎస్ ఆవిర్భావం నుంచి, ఉద్యమంలో 2001 నుంచి 2014 వరకు క్రియాశీలకంగా పనిచేసిన ప్రతీ ఒక్కరికీ సముచిత గౌరవాన్ని కల్పిస్తాం. అన్ని కార్యక్రమాల్లో అందరికీ న్యాయం, గౌరవం దక్కేలా చూస్తాం. కష్టనష్టాలకు ఓర్చి రాష్ట్రం కోసం సీఎం కేసీఆర్‌కు అండగా నిలిచిన ప్రతి ఒక్కరూ గర్వపడేలా చూస్తాం.
>
> -మంత్రి కేటీఆర్

### సత్యనారాయణరెడ్డి భావోద్వేగం

బీఆర్‌ఎస్‌కు పదేండ్లు దూరమై తిరిగి ఆ పార్టీలో చేరుతున్నందుకు గర్వంగా ఉందని సత్యనారాయణరెడ్డి పేర్కొంటూ భావోద్వేగానికి లోనయ్యారు. పార్టీ ఆవిర్భావ సభ్యుడిగా, తొలినాళ్లలో కేసీఆర్‌కు సైనికుడిగా పనిచేసిన తాను తిరిగి బీఆర్‌ఎస్‌లో చేరడం సంతోషంగా ఉందన్నారు. తెలంగాణ వ్యతిరేక శక్తులన్నీ ఒక్కటై కేసీఆర్‌ను పడగొట్టాలని కుట్రలు చేస్తున్నాయని, ఇటువంటి సమయంలో తెలంగాణవాదులందరూ పునరేకీకరణ కావాలని పిలుపునిచ్చారు.

## లోకం పోకడ




లక్కీ, కరెంటు కోతలవల్ల బతికిపోయాం!

## పగలు ఎండ.. రాత్రి చలి

హైదరాబాద్, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో విభిన్న వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. పగలు ఎండ దంచి కొడుతుండగా, రాత్రి పూట చలి పెడుతున్నది. తెల్లవారుజామున చలి మరింతగా పెరుగుతున్నది. అక్టోబరు 23 రాత్రి హనుమకొండలో 16 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. ఉత్తర దిశ నుంచి రాష్ట్రం వైపు గాలులు వీస్తుండటంతో ఈ మార్పులు చోటుచేసుకున్నట్టు వాతావరణ నిపుణులు వెల్లడిస్తున్నారు. హైదరాబాద్‌లో సాధారణం కన్నా 1.7 డిగ్రీల ఉష్ణోగ్రత తగ్గింది. 24న పలు ప్రాంతాల్లో పగటిపూట ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా అధికంగా నమోదయ్యాయి. ఖమ్మంలో పగటిపూట సాధారణం కన్నా 3.8 డిగ్రీలు అధికంగా 35.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. భద్రాచలం 1.7 హైదరాబాద్‌లో 1.3 డిగ్రీలు అధికంగా ఉష్ణోగ్రతలు నమోదైనట్టు వాతావరణశాఖ అధికారులు చెబుతున్నారు.

## వర్షకాలం

| | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| రంగారెడ్డి | 38.4°c | 12.8°c |
| ఆదిలాబాద్ | 37.4°c | 14.7°c |
| మెదక్ | 34.8°c | 14.3°c |
| ఖమ్మం | 34.0°c | 23.0°c |
| మహబూబ్‌నగర్ | 33.2°c | 23.3°c |
| నిజామాబాద్ | 32.4°c | 18.9°c |
| హైదరాబాద్ | 32.1°c | 18.0°c |
| నల్లగొండ | 32.0°c | 20.0°c |
| వరంగల్ | 32.0°c | 19.0°c |
| కరీంనగర్ | 32.0°c | 19.0°c |

# సుడిగాలి పర్యటనతో 'కేసీఆర్ భరోసా'



బుధవారం వనపర్తిలో ప్రజా ఆశీర్వాద సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

**13 రోజులు.. 36 సభలు**

| తేదీ | నియోజకవర్గం |
|---|---|
| 26.10.2023 | అచ్చంపేట, వనపర్తి, మునుగోడు |
| 27.10.2023 | మహబూబాబాద్, వర్ధన్నపేట, స్టేషన్‌ఘన్‌పూర్ |
| 29.10.2023 | కోదాడ, తుంగతుర్తి, ఆలేరు |
| 30.10.2023 | జుక్కల్ , బాన్సువాడ, నారాయణఖేడ్ |
| 31.10.2023 | హుజూర్‌నగర్, మిర్యాలగూడ, దేవరకొండ |
| 01.11.2023 | సత్తుపల్లి, ఇల్లందు |
| 02.11.2023 | నిర్మల్, బాల్కొండ, ధర్మపురి |
| 03.11.2023 | భైంసా (ముథోల్), ఆర్మూర్, కోరుట్ల |
| 05.11.2023 | కొత్తగూడెం, ఖమ్మం |
| 06.11.2023 | గద్వాల్, మక్తల్, నారాయణపేట్ |
| 07.11.2023 | చెన్నూరు, మంథని, పెద్దపల్లి |
| 08.11.2023 | సిర్పూర్, ఆసిఫాబాద్, బెల్లంపల్లి |
| 09.11.2023 | గజ్వేల్, కామారెడ్డి నుంచి కేసీఆర్ నామినేషన్ దాఖలు అనంతరం బహిరంగ సభ |

మొదటిపేజీ తరువాయి...

సభలను నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. 15న హుస్నాబాద్‌లో ఎన్నికల శంఖారావాన్ని పూరించిన సీఎం కేసీఆర్, 18వ తేదీ వరకు నిర్వహించిన ఏడు (హుస్నాబాద్, జనగామ, భువనగిరి, సిరిసిల్ల, సిద్దిపేట, జడ్చర్ల, మేడ్చల్) సభల్లో ప్రసంగించారు. సిద్దిపేట, సిరిసిల్ల సభల్లో సీఎం కేసీఆర్ ప్రసంగాన్ని వినేందుకు ఇండ్లకు తాళాలు వేసి మరీ జనం పోటెత్తి ఈ ఎన్నికల ట్రెండ్‌ను సెట్ చేశాయి. ఈ సభల్లో సీఎం కేసీఆర్ తెలంగాణ పట్ల తనకున్న భావోద్వేగ బంధాన్ని ఆవిష్కరించి ప్రజలను ఎన్నికలకు సమాయత్తం చేశారు. పార్టీ శ్రేణులకు కర్తవ్య బోధ చేశారు. 19 నుంచి 25 వరకు సద్దుల బతుకమ్మ, దసరా పండుగ నేపథ్యంలో ప్రజా ఆశీర్వాద సభలకు విరామం ప్రకటించారు. అయితే ముందుగా విడుదల చేసిన తాత్కాలిక షెడ్యూల్‌లో స్వల్ప మార్పులు చోటుచేసుకున్నాయి. శుక్రవారం పాలేరు, మహబూబాబాద్, వర్ధన్నపేట నియోజకవర్గాల్లో ప్రజా ఆశీర్వాద సభలను ఉద్దేశించి సీఎం కేసీఆర్ ప్రసంగించనున్నారు.

### మునుగోడు ఆసక్తి

గురువారం నిర్వహించే మునుగోడు సభపై సర్వత్రా ఆసక్తి నెలకొన్నది. సరిగ్గా సంవత్సరం క్రితం కాంగ్రెస్ పార్టీకి, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి బీజేపీలో చేరిన కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ఏడాది తిరగకముందే కమలదళానికి నీళ్లు వదిలారు. బుధవారం బీజేపీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరబోతున్నట్టు ప్రకటించారు. మునుగోడు ఉప ఎన్నికల సందర్భంగా మునుగోడు, చండూరు వేదికగా నాడు సీఎం కేసీఆర్ ప్రకటించిన దాదాపు అన్ని హామీలను (చండూరు రెవెన్యూ డివిజన్ సహా) బీఆర్‌ఎస్ ప్రభుత్వం నెరవేరుస్తున్నది. ప్రతి ఎన్నికకు పార్టీలు మారే నాయకులు కావాలా? ఎన్నటికీ మునుగోడుతో పెనవేసుకున్న బీఆర్‌ఎస్ పేగుబంధం కావాలా? అనేది తేల్చుకునే క్రమంలో డోలాయమానంలో ఉన్న మునుగోడు ప్రజలకు సీఎం కేసీఆర్ దిశానిర్దేశం చేయనున్నారనే ఆసక్తి సర్వత్రా నెలకొన్నది. మారుతున్న నేత కావాలా? ప్రజల మేలు కోరే పార్టీ కావాలా? సొంత ప్రయోజనం కోసం పార్టీ మారే నేత కావాలా? అన్న మీమాంసలో మునుగోడు పడింది. ఈ మీమాంసను సీఎం కేసీఆర్ నేడు పటాపంచలు చేస్తారనే ప్రచారం మునుగోడులో పరివ్యాప్తం కావటం విశేషం.



# సీఎం బ్రేక్‌ఫాస్ట్ సూపర్‌హిట్

మొదటిపేజీ తరువాయి...

విస్తరించనున్నారు. వచ్చే సోమవారం నుంచి స్కూళ్ల సంఖ్యను పెంచుతూ.. మరో మూడు వారాల్లో రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సీఎం బ్రేక్‌ఫాస్ట్‌ను అందించనున్నారు. ఈ నెల 6న ప్రారంభించిన సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని నియోజకవర్గానికొక స్కూల్ చొప్పున ఎంపిక చేసి పైలట్ ప్రాజెక్టుగా అమలుచేస్తున్నారు. గత 20 రోజులుగా రాష్ట్రంలోని 119 బడుల్లో ఈ పథకం అమలవుతున్నది. డుమ్మాకొట్టే విద్యార్థులంతా ఇప్పుడు ఉదయాన్నే రెడీ అయి బడిబాట పడుతున్నారు. వారం వ్యవధిలోనే కొన్ని బడుల్లో 10–15శాతం విద్యార్థుల హాజరు పెరగ్గా, మరికొన్ని స్కూళ్లలో 25శాతానిపైగా పెరిగినట్టు ఉపాధ్యాయులు చెప్తున్నారు. గతంలో ఇవే స్కూళ్లలో మధ్యాహ్న భోజనం తినే వారి సంఖ్య తక్కువగా ఉండేది. దీంతో హాజరు శాతం కూడా అదేస్థాయిలో నమోదయ్యేది. ఇప్పుడు విద్యార్థుల హాజరు పెరిగి బడులన్నీ కళకళలాడుతున్నాయి. ఈ స్కీం రాష్ట్ర విద్యావ్యవస్థలో గేమ్‌ఛేంజర్ వంటిదని.. కీలక మార్పునకు శ్రీకారం చుడుతుందని విద్యాశాఖ అధికారులు భావిస్తున్నారు. బడులన్నీ బలోపేతమవుతాయని వారు పేర్కొంటున్నారు.

### పలు స్కూళ్లలో అమలు ఇలా..

- రంగారెడ్డి జిల్లా రావిర్యాల ప్రాథమిక పాఠశాలలో 230 మంది విద్యార్థులుండగా, వీరిలో రోజుకు సగటున 209 చొప్పున విద్యార్థులు అల్పాహారం తీసుకొంటున్నారు.
- నల్లగొండ జిల్లాలోని పద్మానగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 185 మంది విద్యార్థులుంటే.. అత్యధికులు టీ తాగి బడికొచ్చేవారు. ఏమీ తినకుండా వచ్చే విద్యార్థులు ప్రార్థన సమయంలో కండ్లు తిరిగి పడిపోయేవారు. గతంలో రోజు సగటున 150 మంది మాత్రమే బడికొచ్చేవారు. కానీ ఇప్పుడు వారి సంఖ్య సగటున 178 వరకు పెరిగింది.
- హైదరాబాద్ జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆజంపుర నంబర్ –1 స్కూళ్లో మొత్తం 280 మంది విద్యార్థులున్నారు. వీరిలో మధ్యాహ్న భోజనం చేసే వారి సంఖ్య 120కి మించేది కాదు. సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకం కింద విద్యార్థులకు ఇడ్లీ, పూరి, పొంగల్, కిచిడి, ఉప్మా వంటి టిఫిన్లు వడ్డిస్తున్నారు. దీంతో దాదాపు విద్యార్థులందరూ బ్రేక్‌ఫాస్ట్ తీసుకుంటున్నట్టు అధికారులు తెలిపారు.

### ఒక్కో టిఫిన్‌కు రూ.8 –10

బ్రేక్‌ఫాస్ట్ స్కీం మెనూ ఇప్పటికే ఖరారుకాగా, ఒక్కో టిఫిన్‌కయ్యే వ్యయాన్ని కూడా విద్యాశాఖ అధికారులు అంచనావేశారు. ఒక్కోటిఫిన్‌కు రూ. 8 – 10 అవుతుందని ప్రాథమికంగా నిర్ధారించారు. ఇడ్లీ, పూరి వంటి వాటికి రూ. 10, కిచిడి, పొంగల్ వంటి వారికి రూ. 8 ఖర్చు అవుతుందని తేల్చారు. ఇదిలావుండగా, కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకమైన మధ్యాహ్న భోజన స్కీంతో పోల్చితే టిఫిన్‌కయ్యే వ్యయం దాదాపు సమానంగా ఉండటం గమనార్హం.

### రూ. 100 కోట్లు కేటాయించిన సర్కారు

బడుల్లో బ్రేక్‌ఫాస్ట్ పథకం అమలుకు ఏటా రూ. 400 కోట్లు అవసరమవుతుందని ప్రభుత్వం అంచనావేసింది. ఇప్పటికే ఈ పథకం అమలుకు సర్కారు రూ. 100 కోట్లను విడుదల చేసింది. సర్కారీ బడుల్లో విద్యార్థులకు మూడు పూటలా కడుపు నిండా తిండి పెట్టేందుకు ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. ఇందులోభాగంగా విద్యార్థులు ఉదయం బడికి రాగానే టిఫిన్, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం రాగి జావను అందిస్తున్నారు.

### పోషకాహారం కోసం వెయ్యికోట్లు

**ప్రభుత్వ** బడుల్లోని విద్యార్థుల ఆకలి తీర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతైనా ఖర్చుచేస్తున్నది. ఏటా వెయ్యి కోట్లకుపైగా నిధులను వెచ్చిస్తున్నది. మధ్యాహ్న భోజన పథకంలో సన్నబియ్యం కోసం ఏటా రూ.187 కోట్లు, ప్రొటీన్లు సమకూర్చడంలో భాగంగా అందిస్తున్న కోడిగుడ్ల కోసం రూ.120 కోట్లు, 9, 10 తరగతులకు అమలుచేసేందుకు రూ.137 కోట్లు, రక్తహీనతను నివారణకు అందజేస్తున్న రాగిజావ అమలుకు రూ. 32 కోట్లను ప్రభుత్వమే ఖర్చు చేస్తున్నది. తాజాగా బ్రేక్‌ఫాస్ట్‌ను పూర్తిగా ప్రభుత్వ నిధులతోనే సమకూర్చడం విశేషం. మొత్తంమీద మధ్యాహ్న భోజన పథకం కోసం ఏటా రాష్ట్ర ప్రభుత్వం రూ.672 కోట్లను ఖర్చుచేస్తుండగా, బ్రేక్‌ఫాస్ట్ కోసం రూ.400 కోట్లకు పైగా నిధులను వెచ్చిస్తున్నది.

## డీపీఎస్సీ నియామకాలపై వివరణ ఇవ్వండి

- రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరిన హైకోర్టు

హైదరాబాద్, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ): ప్రీ–ప్రైమరీ ఎడ్యుకేషన్‌లో భాగంగా డీపీఎస్సీ (డిప్లమో ఇన్ ప్రీ–స్కూల్ ఎడ్యుకేషన్) అర్హత ఉన్నవారి నియామకాలపై నిర్ణయం తీసుకోకపోవడంపై వివరణ ఇవ్వాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ప్రీ–ప్రైమరీ టీచర్ల నియామకాలను చేపట్టకపోవడంపై కౌంటర్ దాఖలు చేయాలని నోటీసులు జారీచేసింది. జాతీయ విద్యావిధానం–2020 ప్రకారం ప్రీ–ప్రైమరీ టీచర్లుగా డీపీఎస్సీ పూర్తి చేసినవారిని నియమించాల్సి ఉన్నా ప్రభుత్వ జీవో 25లో డీపీఎస్సీ అభ్యర్థులను చేర్చలేదంటూ 36 మంది దాఖలు చేసిన వ్యాజ్యంపై జస్టిస్ సూరేపల్లి నంద ఇటీవల విచారణ జరిపారు. పిటిషనర్ల తరఫు న్యాయవాది వాదిస్తూ.. ఇప్పటికే ఏపీ, కేరళ, పంజాబ్ తదితర రాష్ట్రాల్లో ప్రీ–ప్రైమరీ టీచర్లుగా డీపీఎస్సీ అభ్యర్థులను నియమిస్తున్నారని తెలిపారు. తెలంగాణలో 400 మందికిపైగా అభ్యర్థులు డీపీఎస్సీ కోర్సు పూర్తిచేసినా వారిని ప్రభుత్వ పాఠశాలల్లో నియమించలేదని పేర్కొన్నారు.

## రెండ్రోజుల్లో నిర్ణయం తీసుకుంటా: నాగం

- నాగర్‌కర్నూల్‌లో అనర్హుడికి కాంగ్రెస్ టికెట్
- నాకెందుకివ్వలేదో రేవంత్ సమాధానం చెప్పాలి: నాగం



సిటీబ్యూరో, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ): కార్యకర్తల అభిప్రాయాల మేరకు రెండురోజుల్లో తన భవిష్యత్తు కార్యాచరణను ప్రకటిస్తానని మాజీ మంత్రి నాగం జనార్ధన్ రెడ్డి వెల్లడించారు. నాగర్‌కర్నూల్ టికెట్ ఆశించి భంగపడిన ఆయన తాజాగా నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల కాంగ్రెస్ శ్రేణులతో బుధవారం సమావేశమయ్యారు. తుర్కయాంజల్ మున్సిపాలిటీ బ్రాహ్మణపల్లి చౌరస్తాలోని అరుణ కన్వెన్షన్ హాలులో జరిగిన ఈ సమావేశంలో నాగం తీవ్రస్థాయిలో మాట్లాడారు. ఉదయ్‌పూర్ తీర్మానానికి వ్యతిరేకంగా నాగర్‌కర్నూల్ టికెట్‌ను కూచుకుళ్ల రాజేశ్వర్‌రెడ్డికి ఇచ్చారని ధ్వజమెత్తారు. ఆ తీర్మానం ప్రకారం ఐదేండ్లు పార్టీ సభ్యత్వం ఉండాల్సి ఉండగా, రాజేశ్వర్‌రెడ్డికి కనీసం ఐదు రోజుల సభ్యత్వం కూడా లేదని చెప్పారు. అర్హత లేని వ్యక్తికి టికెట్ ఎలా ఇచ్చారో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కనీసం తనకు కారణం చెప్పకుండా రేవంత్‌రెడ్డి మొహం చాటేస్తున్నాడని ఆరోపించారు. కార్యకర్తల అభిప్రాయాల ప్రకారం రెండు రోజుల్లో తన నిర్ణయాన్ని ప్రకటిస్తానని నాగం జనార్ధన్‌రెడ్డి స్పష్టం చేశారు.

## నకిలీ ఓటరుకార్డులపై సీబీఐ దర్యాప్తు చేయాలి: బీజేపీ

బెంగళూరు, అక్టోబర్ 25: కర్ణాటకలో ఇటీవల వెలుగుచూసిన నకిలీ ఓటరుకార్డు, ఆధార్‌కార్డు కేసులో సీబీఐ లేదా జాతీయ దర్యాప్తు సంస్థతో దర్యాప్తు జరిపించాలని బీజేపీ డిమాండ్ చేసింది. ఈ అంశం జాతీయ భద్రతతో ముడిపడి ఉన్నందున వాటితో దర్యాప్తు జరిపించడమే ఉత్తమమని తెలిపింది. ఈ కేసులో అరెస్టు అయిన ముగ్గురు నిందితులు కాంగ్రెస్ మంత్రి సురేశ్ సన్నిహితులని వెల్లడించింది.

## నిపుణ — విద్య, ఉద్యోగ సమాచారం

### క్రెడిట్ ఆఫీసర్లు

**బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- మొత్తం ఖాళీలు: 100
- పోస్టులు: క్రెడిట్ ఆఫీసర్ (I, II)
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: నవంబర్ 6
- వెబ్‌సైట్: https://bankofmaharashtra.in/current-openings

### స్పోర్ట్స్ కోటాలో...

**సశస్త్ర సీమా బల్ (ఎస్ఎస్‌బీ)లో స్పోర్ట్స్ కోటాలో కింది ఖాళీల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- మొత్తం ఖాళీలు: 272
- పోస్టులు: కానిస్టేబుల్ (జనరల్ డ్యూటీ)
- దరఖాస్తు: వెబ్‌సైట్‌లో
- చివరితేదీ: నవంబర్ 11
- వెబ్‌సైట్: https://applyssb.com

### హాల్‌లో...

**హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హాల్)లో కింది ఖాళీల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- మొత్తం ఖాళీలు: 84
- పోస్టులు: చీఫ్ మేనేజర్, డీజీఎం, ఇంజినీర్, ఫైర్ ఆఫీసర్ తదితరాలు
- దరఖాస్తు: ఆఫ్‌లైన్‌లో
- చివరితేదీ: నవంబర్ 30
- వెబ్‌సైట్: www.hal-india.co.in

### ఆన్‌లైన్‌లో స్టడీ మెటీరియల్

పోటీ పరీక్షల ప్రత్యేకం

- జనరల్ సైన్స్, జనరల్ స్టడీస్, జాగ్రఫీ మెటీరియల్ కోసం పై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.